క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరావు



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా గొలగాని శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ఏలూరు బీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆ పార్టీ బీసీ సెల్ నేతలు అభినందించారు. ఈ సందర్భంగా గొలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీసీ సెల్ ఏలూరు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడంతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ మందిరం రహదారిలో జరుగుతున్న బీటీ రోడ్ నిర్మాణ పనులను 40వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాంబ్వే రోడ్ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌కు అనుసంధానంగా ఉన్న రహదారి గోతులు పడి అధ్వానంగా ఉండటంతో స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ రహదారిలో బీటీ రోడ్ నిర్మాణంతోపాటు ఇరు వైపులా ప్లేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టగా రూ.45 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. వాటితో పనులు మొదలు పెట్టారని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా చేయాలని సూచించినట్లు చెప్పారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా డివిజన్ ప్రజల సేవలోనే ఉంటామని స్పష్టం చేశారు.

పికిల్ బాల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటిన రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఏపీ పికిల్ బాల్ చాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు సత్తా చాటారు. ఈ నెల 6, 7 తేదీల్లో విజయవాడలో జరిగిన 2వ ఏపీ పికిల్ బాల్ చాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో అండర్ 14 నుంచి 60ప్లస్ కేటగిరీల్లో మెన్స్, ఉమెన్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 50ప్లస్ సింగిల్ విభాగంలో రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ డివిజన్‌లోని సీనియర్ డీఈ (బ్రిడ్జి లైన్) పి.శ్రీనివాసరావు తృతీయస్థానం సాధించారు. డబుల్స్ విభాగంలో రైల్వే హాస్పటల్ ఏసీఎంఎస్ డాక్టర్ రవికాంత్‌తో కలసి ఆయన 4వ స్థానాన్ని సాధించారు. ప్రతిభ ప్రదర్శించిన విజేతలకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు పేదరికం అడ్డంకి కాదని గోళ్ల రామచంద్రరావు బాలా త్రిపురసుందరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోళ్ల రామచంద్రరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ప్రాంగణంలోని సిబ్బంది పిల్లలకు, టీసీఎంఏ స్కూల్ ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ పేదరికం కారణంగా ఎవరూ విద్యకు దూరం కాకూడదన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమానికి సంఘ నేత పాకూరి గంగా వెంకటరమేష్ అధ్యక్షత వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఓలేటి జగన్మోహనరావు, జీకేఆర్ నాగభూషణరావు, సభ్యులు మద్ది సుబ్బారావు, పేర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో గ్రీన్ హైడ్రోజన్‌పై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రీన్ హైడ్రోజన్.. భవిష్యత్తు ఇంధనంపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో సదస్సు నిర్వహించనున్నారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు పోస్టర్లను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, రసాయనశాస్త్ర విభాగాధిపతి కల్పన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగం భవిష్యత్తులో ఎంతగా ఉందో తెలియజేయనున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా తయారు చేస్తారు, నిల్వ చేయడం రవాణా అనే అంశాలపై దేశ, విదేశాల నుంచి విచ్చేసే నిష్ణాతులు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి సిగ్నల్!



కేటీరోడ్డులో అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్



చిట్టినగర్ జంక్షన్

- జంక్షన్ దాటేదెలా!
- ట్రాఫిక్‌తో చిట్టినగర్‌లో అష్టకష్టాలు
- ఏళ్ల తరబడి పని చేయని ట్రాఫిక్ సిగ్నల్
- దసరా ఉత్సవాలకు చుక్కలే

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్.. పరిచయం అవసరం లేని ప్రాంతం. ఇది ఆధ్యాత్మిక నగర్. అంతేకాదు ట్రాఫిక్ చిక్కులు కూడా ఎక్కువే. నగరంలోని కీలక ప్రాంతాలను కలుపుతూ ఉన్న సొరంగంతో పాటు ఎర్రకట్ట వైపు నుంచి వచ్చే వాహనాలకు చిట్టినగర్ జంక్షన్ కీలక ప్రాంతం.

దాటేదెలా..

సాధారణ రోజుల్లో చిట్టినగర్ జంక్షన్ దాటాలంటే కష్టమే. ఇక రానున్న దసరా ఉత్సవాల్లో రోడ్డు దాటాలంటే ఓ మహా యుద్ధమే చేయాలి. పశ్చిమ నియోజక వర్గంలో అత్యంత రద్దీగా ఉండే జంక్షన్లలో చిట్టినగర్ ఒకటి.

రెండుచోట్ల సిగ్నల్స్ ఉన్నా పని చేయవు.. మరో రెండువైపుల అసలే లేవు

చిట్టినగర్ జంక్షన్‌లో కొన్నేళ్లుగా ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. ఉదయం, సాయంత్రం కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే వారితో ఈ ప్రాంతం బిజీగా ఉంటుంది. మరో వైపు జంక్షన్‌లో అడ్డా కూలీలు ఎక్కువగానే ఉంటారు. పాలప్రాజెక్టు వైపు దారిలో ట్రాఫిక్ సిగ్నల్ లేదు.



సొరంగం రోడ్డులో పని చేయని సిగ్నల్

ఇక సొరంగం మీదగా వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సిగ్నల్ ఉన్నా అవి పని చేయడం లేదు. మరో వైపున కొత్తపేట నెహ్రూబొమ్మ వైపు నుంచి పాలప్రాజెక్టుకు వెళ్లే వాహనాలకు ఇదే పరిస్థితి. ఎర్రకట్ట వైపు నుంచి వచ్చే దారిలో సిగ్నల్స్ లేవు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం సున్నా!

జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాధారణ రోజుల్లో పరిస్థితి కొంత అయోమయంగా ఉన్నా... దసరా ఉత్సవాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటుంది. సొరంగం వైపు నుంచి వచ్చే వాహనాలతో పాటు ఎర్రకట్ట వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతుంటాయి. కనీసం జంక్షన్‌లో రోడ్డు దాటాలంటే చాలాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఇదిలా ఉంటే వాహనచోదకులు తొందరగా వెళ్లాలనే ఆత్రుతలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

చర్యలు తీసుకోవాలి

దసరా ఉత్సవాలు, భవానీ దీక్ష విరమణల వంటి సమయంలో చిట్టినగర్ జంక్షన్‌లో పోలీసు ఉద్యోగం అంటే తలకు మించిన భారమే అవుతుంది. రద్దీ సమయాల్లో ఒకరిద్దరు పోలీసులు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం, ట్రాఫిక్‌ను నియంత్రించడం ఇబ్బందికరంగ మారాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిట్టినగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశలో సిగ్నల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం చేయనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవానీపురం క్లస్టర్-3 అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం భవానీపురం 40వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అన్నదాత పోరులో ప్రతి ఒక్క రైతు పాల్గొని ప్రభుత్వానికి నిరసనను తెలియజేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండీఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షులు సరగడ శంకర్ రెడ్డి, దొడ్డా రాజశేఖర్ రెడ్డి రైతు విభాగం నాయకులు బత్తిన మల్లికార్జున్ రెడ్డి, మూలే కొండారెడ్డి, కాపులపల్లి చిన్నారెడ్డి, తాడి అంజిరెడ్డి, వెన్న వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి తీరు మారాలి

అన్నదాత పోరు విజయవంతం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వాన్ని నిద్ర నుంచి మేల్కొలపాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా అందించాలని, ఉచిత పంట బీమాను పునరుద్ధరించాలని, వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేసరి కృష్ణారెడ్డి

రైతుల కష్టాలు తీర్చలేని కూటమి

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అన్నదాతల కన్నీటి కష్టాలను తీర్చలేని పాలనలో కూటమి ప్రభుత్వం ఉందని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ పుణ్యశీల పేర్కొన్నారు. సోమవారం పెజ్జోనిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు కన్నీరు కారుస్తున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు అనేక పథకాలను అమలు చేసి వారి కష్టాలు తీర్చారని, కూటమి వచ్చిన తర్వాత వారికి కష్టాలు మొదలయ్యాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మామిడి, మిర్చి, పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఆందోళనతోనే ప్రభుత్వం దిగివచ్చి వారికి ఆదుకునే ప్రయత్నం చేసిందన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 9వ తేదీన ఆర్డీవో కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలతో కలసి అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొలగాని శ్రీను, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ బాబు, పలు విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు వాసా బాబు, బత్తుల పాండు, రబ్బానీ, సంగీత్ బాబు, యశోధర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నేతలతో కలసి 'అన్నదాత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పుణ్యశీల

కూటమి తీరుపై సచివాలయ ఉద్యోగుల ఆందోళన

భవానీపురం(విజయవాడపశ్చిమ): వలంటీర్ల బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించిన కూటమి ప్రభుత్వం తీరుపై వారు ఆందోళన చెందుతున్నారు. వాట్సాప్ సేవలపై ఇంటింటి ప్రచారాన్ని బహిష్కరించాలని నిర్ణయం తీసుకుని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు ఏపీ గ్రామ/వార్డ్ సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల అర్లయ్య, ఎస్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయ ఉద్యోగులను వలంటీర్లులా పని చేయాలని ప్రభుత్వం చెప్పడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు.

మాతృశాఖల విధులు, సచివాలయ సేవలు, సర్వేలతోపాటు వలంటీర్ల పనులూ చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బదిలీలు, హేతుబద్ధీకరణతో వారిపై పని భారం పెరుగుతుందన్నారు.

సీఎం మాటలు, చేతలకు పొంతన లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు సచివాలయ శాఖపై సమీక్ష జరిపి, సచివాలయ ఉద్యోగుల సేవలకు సాంకేతికతను జోడిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని అన్నమాటలకు, నేటి పరిస్థితికి విరుద్ధంగా ఉందని అర్లయ్య, గోవిందరావు తెలిపారు. ఆయన మాటలకు చేతలకు పొంతన లేదని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్ట్ రూపొందించాలని, ఇంటింటికీ తిరిగి చేసే పనుల నుంచి విముక్తి కలిగించాలని, సచివాలయం నుంచి సేవలు అందించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావల్సిన ఆర్థిక ప్రయోజనాలను సత్వరమే అందించాలని, అంతర్ జిల్లాల బదిలీలు చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, లేని పక్షంలో దశలవారీగా ఉద్యమానికి వెనకాడబోమని హెచ్చరించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): కాశేశ్వరరావు మార్కెట్ సమీపంలోని లోబ్రిడ్జి వద్ద ఉన్న 16 ఎంజీడీ 900 మిమి పీఎస్సీ పంపింగ్ మెయిన్‌లైన్ మరమ్మతులకు గురైందని, రిపేరు చేసే క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం నుంచి 10 తేదీ ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గాంధీనగర్, హనుమాన్‌పేట, సత్యనారాయణపురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, శ్రీనగర్ కాలనీ, భానునగర్, టీచర్స్‌కాలనీ, ముత్యాలంపాడు, గవర్నర్‌పేట, అరండల్‌పేట, సూర్యారావుపేట, కస్తూరిబాయి పేట, గిరిపురం, దుర్గాగ్రహారం, సీతారామపురం, బాడవపేట, ఉడ్డుపేట, లబ్బీపేట, మల్లికార్జునపేట, కేదారేశ్వరరావుపేట, పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, లోటస్, రామలింగేశ్వరపేట, అయోధ్యనగర్, శాంతినగర్, ఉప్పరవాగు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని వివరించారు.

కలెక్టర్ సార్ కాపాడండి

పీజీఆర్ఎస్‌లో ఓ బాలుడి ఆవేదన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టర్ సార్ ప్లీజ్...మా నాన్న, బాబాయ్‌ల నుంచి ఆస్తి, ప్రాణాలు కాపాడాలంటూ పద్నాలుగేళ్ల బాలుడు ఓ చేత ఫ్లెక్సీ, మరో చేత తండ్రి నివాసం ఉంటున్న ఇంటి ఫొటోతో కలెక్టరేట్‌లో ప్రదర్శన చేశాడు. విజయవాడ విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన పాగోలు భార్గవ్‌రాజ్ తనతల్లి అరుణతో కలిసి సోమవారం కలెక్టర్‌కు తన గోడు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. చేతిలో ఫ్లెక్సీతో కనిపించడంతో మీడియా అతనిని పలుకరించింది. ఈ సందర్భంగా బాలుడు భార్గవరాజ్ తనగోడు వెళ్లబోసుకున్నాడు.

గొడవల కారణంగా తన తల్లిదండ్రులు పాగోలు విజయ్‌భాస్కర్, అరుణ విడివిడిగా ఉంటున్నారన్నారు. 9వ తరగతి చదువుతున్న తాను అమ్మతో కలిసి అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నానని తెలిపాడు. మెయింటెనెన్స్ కింద తల్లికి తనకు కలిపి నెలకు రూ.50వేలు ఇవ్వాలని కోర్టు ఆదేశించినప్పటికీ వాటిని తనతండ్రి ఏడాదిన్నరగా ఇవ్వక పోతుండటంతో ఇబ్బందిపడుతున్నట్లు వాపోయాడు. అదేమని అడిగితే జైలుకు వెళతాను కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వను అంటున్నాడని తెలిపాడు. మెయింటెనెన్స్ ఇవ్వకపోతే బతికేదెలా అని ఆవేదన వ్యక్తంచేశారు. తన తండ్రికి వీరులపాడు మండలం జయంతి గ్రామంలో 4.86ఎకరాలు, ప్రకాశం జిల్లా బెస్తవారిపాలెంలో 5ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఆ ఆస్తిని తనతండ్రి ఆయన సోదరుడైన ప్రవీణ్ పేర రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. కేవలం మెయింటెనెన్స్ ఎగ్గొంటేందుకు ఇలా చేశాడంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. నాన్న బాబాయ్‌ల నుంచి ఆస్తిని, తన ప్రాణాలను కాపాడాలని పీజీఆర్ఎస్‌లో జేసీ ఇలక్కియాను కలిసి అర్జీ అందజేశాడు. బాబాయ్ ప్రవీణ్ పేర బదిలీ చేసిన ఆస్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, మెయింటెనెన్స్ ఇప్పించాలని ఆ అర్జీలో కోరాడు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీ కొట్టడంతో ఒకరు గాయపడిన ఘటన కొత్తపేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ ప్రాంతానికి చెందిన జగదీశ్వరి, శివ నాగకుమార్ భార్యాభర్తలు. నాగకుమార్ ఇసుక, కంకర వ్యాపారి. ఈ నెల 6న చిట్టినగర్‌లోని టీ స్టాల్‌లో నుంచి వస్తున్న నాగకుమార్‌ను కట్టా షణ్ముక శ్రీనివాస్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. నాగకుమార్ గాయపడగా వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భవానీపురంలో గొలుసు దొంగతనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆఫీసు ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలో చైన్ లాక్కుని వెళ్లిన ఘటన భవానీపురంలో జరిగింది. భవానీపురం బాల భాస్కర్ నగర్‌కు చెందిన పట్నాల లక్ష్మి ఇళ్లలో పనులు చేస్తుంటుంది. సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో లతా హాస్పిటల్ పక్క రోడ్డులో మెడికల్ ఆఫీసు ఎదుట ముగ్గు వేస్తోంది. ఆ సమయంలో మాస్క్ ధరించి ఉన్న వ్యక్తి ఆమె వద్దకు వచ్చి హిందీలో ఏదో అడిగాడు. వెంటనే అతను ఆమె మెడలో చైన్ లాక్కుని పారిపోయాడు. పక్కనే మరో వ్యక్తి హెల్మెట్ పెట్టుకొని బండిపై ఉన్నాడు. ఇద్దరు బైక్ స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయారు. ఘటనపై బాధితురాలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు కాసుల నానుతాడు లాక్కెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

షాదీఖానా అభివృద్ధికి చర్యలు తీసుకోండి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ రెహమతున్నీసా వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని షాదీఖానా నిర్వహణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కోరారు. ఆమె సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. షాదీఖానాలోని మోటర్ మరమ్మతులకు గురై నీటి సరఫరా లేదని, మరుగుదొడ్లు లేక ఫంక్షన్లు చేసుకునేందుకు వచ్చినవారు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. షాదీఖానాలో డ్రెయినేజీ వ్యవస్థ లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. షాదీఖానా నిర్వహణ, అభివృద్ధికి ఏర్పాటు చేసిన కమిటీ కాలపరిమితి పూర్తై ఏడాది దాటినా ఇంత వరకు కొత్త కమిటీని నియమించలేదని చెప్పారు. కొత్త కమిటీ ఏర్పాటైన తర్వాతే ఫండ్స్ రిలీజ్ చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ముస్లిం సామాజికవర్గం ఎక్కువగా ఉండే గట్టు వెనుక ప్రాంతంలో ఉన్న ఏకైక షాదీఖానా దుస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్‌కే నజీర్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఎస్‌కే ఇర్ఫాన్ ఉన్నారు.



షాదీఖానా సమస్యలను ఆలకిస్తున్న ఏజీసీ చంద్రశేఖర్

సౌకర్యాల కల్పనపై నిరంతర పరిశీలన

వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు వీఎంసీ కల్పిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు నిరంతర పరిశీలన చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం లేకుండా ఫిర్యాదుదారుడికి సంతృప్తికరమైన పరిష్కారం అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 7 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికపై 3, ఇంజినీరింగ్ 2, రెవెన్యూ1, ఎస్టేట్ 1 ఫిర్యాదులను అందుకున్నారు. చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున రావు, డెప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్ సమస్యలను తెలుసుకుంటున్న వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్

మత్తు పదార్థాలతో అనర్థంపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తుతో విద్యార్థుల భవిత అంధకారమవుతుందని మత్తు పదార్థాల వినియోగంతో శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలుగా మారితే వారిని నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన 'బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని' ఉచితంగా సంప్రదించవచ్చని ఫోన్ నంబర్ 94904 92020 తెలిపారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోర్డినేటర్స్ జాకబ్ రాజు, ప్రియాంక, నజ్మా, జె.జ్యోతి చంద్రిక, ప్రధానోపాధ్యాయులు పద్మలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు

15 నుంచి విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రణభేరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగంలోని ఉద్యోగుల సమస్యలు ఆర్థిక ఇబ్బందులపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ రణభేరి పేరుతో జాతను చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ చెప్పారు. సంఘ కార్యాలయంలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా ఉద్యోగుల ఆర్థిక పరమైన ఏ ఒక్క సమస్య పరిష్కారానికి చర్యలు చూపలేదన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ కమిషనర్‌ను నియమించలేదని చెప్పారు. వీటిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసు, ఏ సుందరయ్య మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల గ్రాట్యూటీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో ఉపాధ్యాయులకి అసెస్మెంట్ బుక్స్‌లో పరీక్ష విధానం పిల్లలకు కాకుండా ఉపాధ్యాయులకు పరీక్షగా మారిందన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల పని భారం, విద్యాశక్తి కార్యక్రమాలు, ఆన్‌లైన్ పనులు, పరీక్ష మూల్యాంకనం, గ్రీన్‌పాస్ స్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు పనిభారం విపరీతంగా మోపుతున్నారన్నారు. యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యాన సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరీ పేరుతో ప్రచార జాతను నిర్వహిస్తున్నామన్నారు. 25న రాష్ట్రంలో విజయవాడలో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఐక్య ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు రామకృష్ణ, నగర నాయకులు రామారావు, జానకి, రూరల్ మండలం అధ్యక్షులు ఎస్ ఆర్‌హెచ్‌పీ దేవ్, రమేష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుందరయ్య, శ్రీనివాసు తదితరులు

పిన్న వయసు.. పెద్ద మనసు

దొరికిన పర్సును పోలీసులకు అప్పగించిన 5వ తరగతి విద్యార్థి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై దొరికిన పర్సును బాధితులకు అందజేయాలని ఆ చిన్నారి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులకు అప్పగించారు. చిన్నారి పెద్ద మనసును కొత్తపేట సీఐ కొండలరావుతో పాటు స్టేషన్ అధికారులు అభినందించారు. కొత్తపేటలోని తేలప్రోలు రాజా స్కూల్‌లో దల్లి వెంకటేష్ 5వ తరగతి విద్యార్థి. సోమవారం స్కూల్‌కు వెళ్లిన వెంకటేష్‌కు శ్రీనివాసమహల్ వద్ద రోడ్డుపై ఓ పర్సు కనిపించింది. అందులో కొంత నగదుతో పాటు ఐడీ కార్డు ఉండటంతో చుట్టూ చూడగా అక్కడ ఎవరూ కనిపించలేదు. దీంతో వెంటనే వాగు సెంటర్‌లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. తనకు రోడ్డుపై దొరికిన పర్సు గురించి చెప్పి పోలీసులకు ఆ పర్సు అందించారు. సీఐ కొండలరావు వెంకటేష్‌ను పిలిచి మాట్లాడి పర్సులో ఏం ఉన్నాయని పరిశీలించారు. రూ. 14 వేల నగదు ఉన్నట్లు గుర్తించి ఐడీ కార్డులో ఉన్న మహిళకు సమాచారం అందించారు. వాగు సెంటర్‌కు చెందిన సూరకమల కుమారికి చిన్నారి వెంకటేష్ సమక్షంలోనే పర్సును అందించారు. దొరికిన పర్సును బాధితురాలికి చేర్చిన వెంకటేష్‌ను అందరూ అభినందించారు.



బాధితురాలికి పర్సును అందజేస్తున్న వెంకటేష్, సీఐ కొండలరావు